జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 89 ॥ సోమవారం ॥ 24-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



23 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి ఏకాదశి తె. 4:18o వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మూల సా. 5:35 వరకు తరువాత పూర్వాషాఢ యోగం విష్కంభ ఉ. 6:13 వరకు కరణం వనిజ మ. 3:10 వరకు విష్టి తె. 4:18o వరకు వర్జ్యం మ. 3:56 నుండి సా. 5:44 వరకు దుర్ముహూర్తం సా. 4:53 నుండి సా. 5:43 వరకు రాహుకాలం సా. 4:59 నుండి సా. 6:33 వరకు యమగండం మ. 12:18 నుండి మ. 1:52 వరకు గుళికాకాలం మ. 3:25 నుండి సా. 4:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు ఉ. 10:38 నుండి మ. 12:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

## ప్రకాశం పంతులుకు చంద్రబాబు నివాళి

**చిత్రపటానికి పూలమాల వేసిన చంద్రబాబు.. స్వాతంత్ర్య పోరాట సేవలను కొనియాడిన ముఖ్యమంత్రి**



అమరావతి, ఆగస్టు 23: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చూపిన ధైర్యసాహసాలు తరతరాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన మహనీయుల్లో ప్రకాశం తరువాయి 2 వ పేజీలో...

## తెలంగాణ రైజింగ్‌కు ప్రపంచవ్యాప్త ప్రచారం

**లండన్‌లో తెలుగు ప్రవాసులతో సీఎం భేటీ**

**రాయబారులుగా నిలవాలని రేవంత్ పిలుపు**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లోని తెలుగు ప్రవాసులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలుగు ప్రవాసులతో ముఖాముఖి సమావేశమై రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశపై చర్చించారు.

లండన్, ఆగస్టు 23: ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యాలను ముఖ్య మంత్రి వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, (మిగతా 2వ పేజీలో)



## ప్రజారోగ్య వ్యవస్థల బలోపేతమే లక్ష్యం

- నారాయణఖేడ్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం
- జిల్లా కేంద్రాల్లోనే 90 % వైద్య చికిత్సలు
- ప్రభుత్వ ఆసుపత్రులపై పెరుగుతున్న ప్రజల విశ్వాసం
- వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటించి ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డితో కలిసి పాల్గొన్న మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని విధాలుగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రాల్లోనే అత్యధిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.**

- నారాయణఖేడ్, ఆగస్టు 23 :

ప్రస్తుతం రాష్ట్రంలో 90 శాతం వైద్య చికిత్సలు జిల్లా స్థాయిలోనే అందే విధంగా ప్రజారోగ్య వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రజలు చిన్నచిన్న వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ (మిగతా 2వ పేజీలో)

## సూపర్ స్మార్ట్ సిటీగా నల్గొండ

**మౌలిక వసతుల అభివృద్ధికి భారీ ప్రణాళికలు**

**24 గంటల తాగునీటి సరఫరాకు చర్యలు**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

నల్గొండ, ఆగస్టు 23 :

నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం నల్గొండ క్లబ్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు గదులు, సమావేశ (మిగతా 2వ పేజీలో)



## శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ అభినందనలు

**చంద్రయాన్-3 విజయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి**

**స్పేస్‌టెక్ హబ్‌గా తెలంగాణ ఎదుగుతోంది**

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దేశ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన వారి కృషిని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, చంద్రయాన్-3 విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు.



## బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం

అమరావతి, ఆగస్టు 23:

వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేడు, రేపు పలుచోట్ల మోస్తరు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏపీఎస్డీఎంఏ తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. దీంతో సముద్రం అలజడిగా మారే అవకాశముండటంతో తీర ప్రాంతాల్లో జాగ్రత్తలు అవసరమని పేర్కొంది. తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదిక ప్రకారం ఆగస్టు 23 ఉదయం నాటికి అల్పపీడనం వాయువ్య బంగాళాఖాతంలోనే కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వెల్లడించింది. ఈ వ్యవస్థ ప్రభావంతో మేఘాల కదలికలు పెరిగి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

## ఆటో డ్రైవర్ల బంద్‌కు మద్దతు

**డిమాండ్లు పరిష్కరించాలన్న శ్రీనివాస్ గౌడ్**

**సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**

**పెరుగుతున్న ఖర్చులతో డ్రైవర్లకు ఇబ్బందులు**

మహబూబ్‌నగర్, ఆగస్టు 23 :

ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన బంద్‌కు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మద్దతు ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించి డ్రైవర్ల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఆటో రవాణా రంగ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన (మిగతా 2వ పేజీలో)







## విద్యుత్ ప్రదర్శనకు విశేష స్పందన

- రెండో రోజు సందర్శకులతో కిటకిటలాడిన ప్రాంగణం
- విద్యార్థులను ఆకట్టుకున్న ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు
- విద్యుత్ భద్రతపై ప్రత్యేక అవగాహన
- ప్రజలకు చేరువవుతున్న విద్యుత్ రంగ పురోగతి

2

## రూ.3,500 కోట్ల రక్షణ ప్రాజెక్టులకు భూమిపూజ

- నౌకానిర్మాణ రంగానికి భారీ ఊతం
- ఐదు విస్తరణ ప్రాజెక్టులకు శ్రీకారం
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి బలం 2
- కోల్‌కతా నుంచి వర్చువల్‌గా ప్రారంభం



# నేటి రాశి ఫలాలు

మేషం: చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

వృషభం: ఇంటా బయట పరిస్థితులు కొంత నిరుత్సాహ పరుస్తాయి. శ్రమాధిక్యతతో కానీ పనులు పూర్తికావు. బంధుమిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్య పరుస్తుంది. అనారోగ్య సమస్యలు భాధిస్తాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు.

మిధునం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సంతాన వివాహ విషయంలో చర్చలు సఫలం అవుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కర్కాటకం: నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలుగుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

సింహం: కొన్ని వ్యవహారాలు మందగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ఒడిదుడుకులుగా ఉంటుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

కన్య: దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కీలక వ్యవహారాలలో రెండు రకాలయిన ఆలోచనల వలన ఇబ్బందులు తప్పవు. బంధువులు, మిత్రులు మీ మాటతో విభేదిస్తారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు.

తుల: చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యత నుండి ఉపశమనం పొందుతారు. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి.

వృశ్చికం: కీలక వ్యవహారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో సమస్యలను అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

ధనస్సు: ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహ పరుస్తాయి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఇంటాబయట బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు స్థాన చలన సూచనలు ఉన్నవి.

మకరం: ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. సొంత నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమై విశ్రాంతి లభించదు. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి.

కుంభం: అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఇంటా బయట మీ మాటకి విలువ పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగవుతుంది. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు.

మీనం: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలించక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. దూరప్రయాణాలు వలన శారీరక శ్రమ అధికమవుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించడం మంచిది. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. ఉద్యోగమున సహోద్యోగుల ప్రవర్తన కొంత చికాకు పరుస్తుంది.



# ప్రకాశం పంతులుకు చంద్రబాబు నివాళి

మొదటి పేజీ తరువాయి

పంతులు ఒకరని సీఎం గుర్తుచేశారు. ప్రజల హక్కుల కోసం రాజీ పడకుండా నిలబడిన ఆయన వ్యక్తిత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణంలో ప్రకాశం పంతులు పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజాసేవ, నిబద్ధత, త్యాగనిరతి ఆయన జీవితానికి ప్రతీకలుగా నిలిచాయని కొనియాడారు. దేశం, రాష్ట్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలను యువత గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వారి ఆశయాల సాధనకు కృషి చేయడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని చెప్పారు. టంగుటూరి ప్రకాశం పంతులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి, జయంతి సందర్భంగా మరోసారి ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పించారు.

# లండన్‌లో తెలుగు ప్రవాసులతో సీఎం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణ, విద్యా మరియు సాంకేతిక రంగాల్లో చేపడుతున్న సంస్కరణలను ప్రవాసులకు వివరించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో ఆత్మీయంగా ముచ్చటించిన ముఖ్యమంత్రి, తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పరిచయాలు, అనుభవాలు, నైపుణ్యాలను రాష్ట్ర పురోగతికి ఉపయోగించాలని కోరారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రతి దేశంలో ప్రచారం చేస్తూ రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని సూచించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రవాసులకు వివరించారు. రాష్ట్రంలో కొత్త అవకాశాలను గుర్తించి పెట్టుబడులు పెట్టాలని కోరారు.

# విద్యుత్ ప్రదర్శనకు విశేష స్పందన





**రెండో రోజు సందర్శకులతో కిటకిటలాడిన ప్రాంగణం**

**విద్యార్థులను ఆకట్టుకున్న ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు**

**విద్యుత్ భద్రతపై ప్రత్యేక అవగాహన**

**ప్రజలకు చేరువవుతున్న విద్యుత్ రంగ పురోగతి**

హైదరాబాద్, ఆగస్టు 23 :

హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్--2026 రెండో రోజు సందర్శకులతో కళకళలాడింది. ఉదయం నుంచే పాఠశాల విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యుత్ రంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, భద్రతా ప్రమాణాలు, విద్యుత్ సంస్కరణలపై ఆసక్తిగా అవగాహన పొందారు. ప్రత్యేకంగా విద్యార్థులు వివిధ స్టాళ్లను సందర్శిస్తూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వినియోగదారుల ఇళ్ల వరకు విద్యుత్ ఎలా చేరుతుందనే అంశాలను అధికారులు, ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భద్రతా పరికరాలు, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యుత్ రంగంలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికతలు, కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు, విద్యుత్ అంతరాయాల నివారణకు చేపడుతున్న చర్యలు, వినియోగదారులకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవల గురించి అధికారులు వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ విద్యుత్ రంగంపై సమగ్ర అవగాహన పెంపొందించుకున్నారు. విద్యుత్ భద్రతకు సంబంధించిన ప్రత్యేక స్టాళ్లలో విద్యుత్ ప్రమాదాల నివారణ, సురక్షిత వినియోగ పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు సాధారణ సందర్శకులు కూడా ఈ ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పవర్ ఎగ్జిబిషన్ ద్వారా తెలంగాణ విద్యుత్ రంగంలో జరుగుతున్న అభివృద్ధి, సాంకేతిక పురోగతి, వినియోగదారుల సేవల మెరుగుదలపై ప్రజలకు ప్రత్యక్ష అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. విద్యుత్ రంగంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు యువతలో సాంకేతిక ఆసక్తిని పెంపొందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలు చేపడుతున్న ఆధునీకీకరణ కార్యక్రమాలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, డిజిటల్ సేవలు, భవిష్యత్ విద్యుత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్న ప్రణాళికలను ఈ ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారు. రెండో రోజు భారీగా సందర్శకులు తరలివచ్చిన నేపథ్యంలో చివరి రోజున మరింత రద్దీ ఉండే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

# రూ.3,500 కోట్ల రక్షణ ప్రాజెక్టులకు భూమిపూజ

**నౌకానిర్మాణ రంగానికి భారీ ఊతం**

**ఐదు విస్తరణ ప్రాజెక్టులకు శ్రీకారం**

**ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి బలం**

**కోల్‌కతా నుంచి వర్చువల్‌గా ప్రారంభం**

కోల్‌కతా, ఆగస్టు 23 :

దేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రూ.3,500 కోట్ల విలువైన ఐదు విస్తరణ ప్రాజెక్టులకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భూమిపూజ నిర్వహించారు. కోల్‌కతాలోని జీఆర్‌ఎస్‌ఈ భవన్ నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సమక్షంలో ఈ కార్యక్రమం వర్చువల్ విధానంలో జరిగింది. గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ), యంత్ర ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు దేశ నౌకానిర్మాణ, నౌక మరమ్మతులు, లోహ పరిశ్రమలు మరియు ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణకు కీలకంగా మారనున్నాయి. రక్షణ రంగంలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాలు అమలు కానున్నాయి. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశ రక్షణ రంగాన్ని స్వావలంబన దిశగా తీసుకెళ్లడంలో ఇటువంటి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అధిక ఉత్పత్తి సామర్థ్యాలతో భారతదేశాన్ని ప్రపంచ స్థాయి రక్షణ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నౌకానిర్మాణ పరిశ్రమకు కొత్త ఊపు లభించడంతో పాటు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడనున్నాయని అధికారులు తెలిపారు. దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా ఆధునిక ఉత్పత్తి కేంద్రాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల లక్ష్యాల సాధనలో ఈ విస్తరణ ప్రాజెక్టులు మరో మైలురాయిగా నిలుస్తాయని రక్షణ శాఖ పేర్కొంది. స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచడం ద్వారా విదేశీ ఆధారాన్ని తగ్గించే దిశగా ఇవి కీలక అడుగులుగా భావిస్తున్నారు. రక్షణ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఈ ప్రాజెక్టులు ఊతమివ్వనున్నాయని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక మౌలిక వసతుల

# సూపర్ స్మార్ట్ సిటీగా నల్గొండ

(మొదటి పేజీ తరువాయి)

మందిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నల్గొండ పట్టణ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు రూ.125 కోట్ల అంచనా వ్యయంతో ప్రత్యేక పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో ఈ పనులను పూర్తి చేసి పట్టణానికి 24 గంటల తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అవసరమైన నిధులను సమీకరించి, సాగునీటి శాఖ సహకారంతో పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. 2028 ఆగస్టు నాటికి ఎస్‌ఎల్‌బీసీ పనులను పూర్తిచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.2,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్లకు పెరిగినప్పటికీ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని మంత్రి చెప్పారు.

# శాస్త్రవేత్తలకు రేవంత్ అభినందనలు

హైదరాబాద్, ఆగస్టు 23 :ఈ ఘనత ద్వారా ప్రపంచానికి భారత శాస్త్ర, సాంకేతిక సామర్థ్యం మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి చేర్చిన ఈ విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. చంద్రయాన్-3 వంటి విజయాల వెనుక శాస్త్రవేత్తల అంకితభావం, ఎన్నో సంవత్సరాల పరిశోధనలు, నిరంతర కృషి దాగి ఉందని సీఎం తెలిపారు. ఈ మహత్తర విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధిస్తున్న విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా అంతరిక్ష, సాంకేతిక రంగాల్లో ముందంజలో నిలుస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. స్టార్టప్‌లకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రం స్పేస్‌టెక్ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.



# ప్రజారోగ్య వ్యవస్థల బలోపేతమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచడంతో ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల ఆదరణ రోజురోజుకు పెరుగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో చేపడు తున్న సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సబ్ కలెక్టర్ హరిణి, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే. శ్రీధర్, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పునరుద్ఘాటించారు.



శ్వేత

## సంపాదకీయం

**సోమవారం 24-8-2026**

# చరిత్రను మరచిపోతే తప్పిదాలు పునరావృతమవుతాయి

మానవ నాగరికత వేల సంవత్సరాల ప్రయాణంలో ఎన్నో విజయాలు, వైఫల్యాలు, యుద్ధాలు, విప్లవాలు, సామాజిక మార్పులను చూసింది. ఈ అనుభవాల సమాహారమే చరిత్ర. గత తరాలు ఎదుర్కొన్న సవాళ్లు, వారు చేసిన పొరపాట్లు, సాధించిన విజయాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. అందుకే చరిత్రను కేవలం గత సంఘటనల నమోదు పుస్తకంగా కాకుండా భవిష్యత్తుకు దిక్సూచిగా భావిస్తారు. చరిత్రను గుర్తుంచుకున్న సమాజాలు ముందుకు సాగుతాయి. దానిని నిర్లక్ష్యం చేసిన సమాజాలు అదే తప్పిదాలను మళ్లీ మళ్లీ పునరావృతం చేసే ప్రమాదంలో పడతాయి. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే యుద్ధాలు, అణచివేతలు, వివక్ష, ద్వేష రాజకీయాలు మానవాళికి ఎంతటి నష్టాన్ని కలిగించాయో స్పష్టంగా తెలుస్తుంది. రెండు ప్రపంచ యుద్ధాలు కోట్లాది మంది ప్రాణాలను బలిగొన్నాయి. నియంతృత్వ పాలనలు లక్షలాది కుటుంబాలను ఛిన్నాభిన్నం చేశాయి. జాతి, మత, వర్గ విభేదాల పేరుతో జరిగిన హింసాకాండలు సమాజాలను దశాబ్దాల వెనక్కి నెట్టాయి. ఈ సంఘటనలు కేవలం చరిత్ర పుస్తకాలలోని పాఠాలు మాత్రమే కాదు, భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా హెచ్చరించే గుణపాఠాలు.

స్వాతంత్ర్య ఉద్యమాల చరిత్ర కూడా మనకు విలువైన సందేశాలను అందిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం కోసం లక్షలాది మంది చేసిన త్యాగాల ఫలితంగానే నేడు అనేక దేశాలు స్వతంత్రంగా నిలిచాయి. ఆ త్యాగాలను మరచిపోతే స్వేచ్ఛ విలువను అర్థం చేసుకోలేం. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎంత కష్టపడి సాధించబడ్డాయో తెలుసుకున్నప్పుడే వాటిని పరిరక్షించాలనే బాధ్యత పెరుగుతుంది. చరిత్ర మనకు విజయాల కథలను మాత్రమే చెప్పదు. అభివృద్ధికి దారితీసిన నిర్ణయాలు, విఫలతకు కారణమైన పొరపాట్లు రెండింటినీ చూపిస్తుంది. ఆర్థిక సంక్షోభాలు, సామాజిక అసమానతలు, రాజకీయ అశాంతి వంటి పరిస్థితులు ఎలా ఏర్పడ్డాయో అధ్యయనం చేయడం ద్వారా నేటి విధాన రూపకర్తలు మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అందుకే చరిత్ర అధ్యయనం ఒక దేశ అభివృద్ధికి కూడా అవసరమైన అంశంగా పరిగణించబడుతుంది.

నేటి డిజిటల్ యుగంలో సమాచారం వేగంగా అందుబాటులోకి వస్తున్నప్పటికీ, చరిత్రపై అవగాహన తగ్గుతున్నదనే ఆందోళన వ్యక్తమవుతోంది. తక్షణ సమాచారం కోసం పరుగులు తీస్తున్న సమాజం, గతం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను విస్మరించే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా యువతకు చరిత్రను కేవలం పరీక్షల అంశంగా కాకుండా జీవిత పాఠంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. చరిత్రను అర్థం చేసుకున్న వ్యక్తి సమాజాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోగలడు. చరిత్రను మరచిపోవడం అంటే కేవలం సంఘటనలను మర్చిపోవడం కాదు. ఆ సంఘటనల వెనుక ఉన్న కారణాలు, పరిణామాలు, పాఠాలను కోల్పోవడం. అలాంటి పరిస్థితుల్లో సమాజం మళ్లీ అదే పొరపాట్ల దారిలో నడిచే ప్రమాదం ఉంటుంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ మత విద్వేషాలు, జాతి వివక్ష, అసహనం కనిపించడం దీనికి ఉదాహరణ. గతంలో ఇవి ఎంతటి విపత్తులకు దారితీశాయో తెలిసినా వాటిని పునరావృతం చేయడం ఆందోళనకర విషయం.

ఒక దేశ చరిత్ర దాని గుర్తింపు. సంస్కృతి, సంప్రదాయాలు, భాష, సామాజిక విలువలు అన్నీ చరిత్రతో ముడిపడి ఉంటాయి. చరిత్రను కాపాడుకోవడం అంటే జాతి ఆత్మను కాపాడుకోవడం. పురాతన వారసత్వ సంపదలను సంరక్షించడం, చారిత్రక ప్రదేశాలను పరిరక్షించడం, చరిత్ర పరిశోధనలను ప్రోత్సహించడం వంటి చర్యలు ఈ బాధ్యతలో భాగం. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తమ చరిత్రను భవిష్యత్తు తరాలకు చేరవేయడానికి మ్యూజియంలు, స్మారక చిహ్నాలు, విద్యా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాయి. గతంలో జరిగిన విషాద ఘటనలను కూడా ప్రజలకు తెలియజేస్తున్నాయి. ఎందుకంటే బాధాకరమైన చరిత్రను దాచిపెట్టడం కాదు, దాని నుంచి పాఠాలు నేర్చుకోవడమే నిజమైన పురోగతి. చరిత్రను ఎదుర్కొనే ధైర్యం ఉన్న సమాజాలే స్థిరమైన భవిష్యత్తును నిర్మించగలవు.

నేటి ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతికత కొత్త అవకాశాలను అందిస్తున్నప్పటికీ, మానవ విలువలను కాపాడుకోవడం కూడా అంతే అవసరం. గతంలో జరిగిన యుద్ధాలు, అణచివేతలు, సామాజిక విభేదాలు మనకు ఒకే విషయాన్ని చెబుతున్నాయి. ద్వేషం, అసహనం, అధికారం పట్ల వ్యామోహం చివరికి వినాశనానికే దారితీస్తాయి. శాంతి, సహనం, పరస్పర గౌరవం మాత్రమే స్థిరమైన అభివృద్ధికి మార్గం. చరిత్రను మరచిపోతే తప్పిదాలు పునరావృతమవుతాయనే హెచ్చరిక కేవలం ఒక సూక్తి కాదు, మానవ అనుభవం నుంచి వచ్చిన సత్యం. గతాన్ని గుర్తుంచుకోవడం అంటే వెనక్కి చూడడం కాదు; భవిష్యత్తును సురక్షితంగా నిర్మించుకోవడం. చరిత్ర అందించిన పాఠాలను గౌరవించి, వాటి ఆధారంగా సమానత్వం, న్యాయం, ప్రజాస్వామ్యం, మానవతా విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడం ప్రతి తరంపై ఉన్న బాధ్యత. అదే చరిత్రకు చెల్లించే నిజమైన గౌరవం.



# అంతర్జాల విప్లవం మార్చిన ప్రపంచం

**డెస్క్ ఆగస్టు 23 :**

నేటి ఆధునిక ప్రపంచాన్ని ఊహించుకోవాలంటే అంతర్జాలం లేకుండా ఆలోచించడం దాదాపు అసాధ్యం. ప్రపంచంలోని కోట్లాది మంది ప్రజలను ఒకే సమాచార వేదికపైకి తీసుకువచ్చిన మహత్తర ఆవిష్కరణ ఇంటర్నెట్. సమాచార మార్పిడి, విద్య, వ్యాపారం, వినోదం, పాలన, వైద్యం వంటి ప్రతి రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది కారణమైంది. 1991 ఆగస్టు 23న సర్ టిమ్ బెర్నర్స్-లీ వరల్డ్ వైడ్ వెబ్‌ను సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రపంచ సమాచార చరిత్రలో కొత్త యుగానికి శ్రీకారం చుట్టారు. ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం ఇంటర్నెట్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మనిషి నాగరికత అభివృద్ధిలో సమాచార ప్రసార వ్యవస్థలకు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంది. ఒకప్పుడు సందేశాలను చేరవేయడానికి రోజుల తరబడి సమయం పట్టేది. ఆ తరువాత టెలిఫోన్, రేడియో, టెలివిజన్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు వచ్చినప్పటికీ, సమాచారాన్ని అందరికీ సమానంగా అందుబాటులోకి తీసుకురావడంలో పరిమితులు ఉండేవి. కానీ ఇంటర్నెట్ ఆ అడ్డంకులన్నింటినీ తొలగించి ప్రపంచాన్ని ఒకే సమాచార కుటుంబంగా మార్చింది.

సర్ టిమ్ బెర్నర్స్-లీ రూపొందించిన వరల్డ్ వైడ్ వెబ్ మానవ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ఆవిష్కరణలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా ఆయన ఈ సాంకేతికతను ప్రపంచ ప్రజలందరికీ స్వేచ్ఛగా వినియోగించుకునేలా అందుబాటులో ఉంచడం వల్లే నేడు ఇంటర్నెట్ ఇంత విస్తృతంగా అభివృద్ధి చెందింది. జ్ఞానాన్ని కొందరి చేతుల్లో పరిమితం చేయకుండా ప్రపంచానికి పంచాలనే ఆయన దూరదృష్టి మానవాళికి అపూర్వమైన వరంగా మారింది. ఇంటర్నెట్ వల్ల విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థల పాఠాలు, పరిశోధనలు, గ్రంథాలు నేడు ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉన్నాయి. దూర విద్య, ఆన్‌లైన్ శిక్షణ, డిజిటల్ గ్రంథాలయాలు లక్షలాది మందికి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. విజ్ఞానాన్ని ప్రజాస్వామ్యీకరించిన సాధనంగా ఇంటర్నెట్ నిలిచింది.

**వ్యాపార రంగంలో కూడా ఇంటర్నెట్ కీలక పాత్ర పోషించింది. చిన్న వ్యాపారి నుంచి అంతర్జాతీయ సంస్థల వరకు ప్రతి ఒక్కరూ డిజిటల్ వేదికలను వినియోగిస్తున్నారు. ఆన్‌లైన్ వాణిజ్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భాగంగా మారింది. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ సేవలు, వర్చువల్ కార్యాలయాలు వ్యాపార విధానాలను పూర్తిగా మార్చేశాయి. ప్రపంచ మార్కెట్లను చేరుకోవడం ఇప్పుడు మరింత సులభమైంది. సమాజంలో సమాచార ప్రాప్తిని పెంచడంలో కూడా ఇంటర్నెట్ విశేష సేవలందించింది. వార్తలు, ప్రభుత్వ ప్రకటనలు, ప్రజా సేవలు, అత్యవసర హెచ్చరికలు క్షణాల్లో ప్రజలకు చేరుతున్నాయి. ప్రకృతి విపత్తులు, ఆరోగ్య సంక్షోభాలు వంటి సందర్భాల్లో సమాచారాన్ని వేగంగా అందించడంలో ఇంటర్నెట్ కీలక సాధనంగా నిలుస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత పెరగడానికి కూడా ఇది దోహదపడుతోంది.**

అయితే ఇంటర్నెట్ విస్తరణతో కొన్ని సవాళ్లు కూడా ముందుకు వచ్చాయి. తప్పుడు సమాచారం వ్యాప్తి, సైబర్ నేరాలు, డేటా చోరీలు, వ్యక్తిగత గోప్యతకు ముప్పు, ఆన్‌లైన్ మోసాలు వంటి సమస్యలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. సాంకేతికతను ఎంత జాగ్రత్తగా వినియోగిస్తే అంత ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని ఈ పరిస్థితులు సూచిస్తున్నాయి. అందువల్ల డిజిటల్ బాధ్యతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది. యువతకు ఇంటర్నెట్ అపార అవకాశాలను అందిస్తున్నప్పటికీ, దాని వినియోగంలో సమతుల్యత అవసరం. విజ్ఞాన సాధన, నైపుణ్యాల అభివృద్ధి, సృజనాత్మకత పెంపొందించుకోవడానికి ఇది ఒక శక్తివంతమైన వేదిక. అయితే అనవసర వినోదం, వ్యసనాలకు దూరంగా ఉండి సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం. డిజిటల్ ప్రపంచంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడం నేటి తరానికి అత్యవసరం.

భారత్‌లో ఇంటర్నెట్ విస్తరణ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కొత్త ఊపునిచ్చింది. గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ సేవలు చేరడం, ప్రభుత్వ సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రావడం, డిజిటల్ చెల్లింపుల పెరుగుదల వంటి పరిణామాలు దేశ ప్రగతికి దోహదపడుతున్నాయి. డిజిటల్ భారత్ వంటి కార్యక్రమాలు సాంకేతికతను ప్రజల జీవితాల్లో మరింత చేరువ చేస్తున్నాయి. ఇంటర్నెట్ దినోత్సవం ఒక సాంకేతిక ఆవిష్కరణను గుర్తుచేసుకునే సందర్భం మాత్రమే కాదు. జ్ఞానాన్ని పంచుకునే స్వేచ్ఛకు, ప్రపంచాన్ని అనుసంధానించే శక్తికి, మానవాళి పురోగతికి ప్రతీకగా నిలిచిన అంతర్జాల విప్లవానికి నివాళు లర్పించే రోజు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, అధునాతన డిజిటల్ వ్యవస్థలు మరింత అభివృద్ధి చెందినా, వాటికి పునాది వేసిన ఇంటర్నెట్ ప్రాముఖ్యత ఎప్పటికీ చెక్కుచెదరదు. జ్ఞానం, అవకాశాలు, అనుసంధానానికి వారధిగా ఇంటర్నెట్ మానవాళికి అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.



# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

### జిల్లాకు గుర్తింపు తేవడం గర్వంగా ఉంది: కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, ఆగస్టు 23, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం గర్వంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయం నందు నెల్లిమర్ల చిన్నమల్లుపేట ఎంపీపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేసే కౌలూరి రాజేష్ కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వచ్చిన సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాజేష్ అనే యువ టీచర్ విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో ముందుకు సాగటం అభినందనీయమన్నారు. రాజేష్ ను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేసి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందజేయటానికి కృషి చేయాలన్నారు. రాజేష్ తనకు అవార్డు రావడానికి గల కారణాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి వివరించారు. విద్యాబోధనా ప్రయాణంలో సాంకేతికతను సమర్థవంతంగా జోడించి, క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలు సాధించడమే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడానికి ప్రధాన కారణమైనట్లు రాజేష్ తెలిపారు.



# పీజీఆర్ఎస్‌పై స్పందనకు ప్రత్యేక క్యూఆర్ కోడ్

### ఈ నెల 24న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ..

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఈ నెల 24వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం ... పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని.. అదే విధంగా అర్జీదారులు తమ స్పందన తెలియజేసేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంతో పాటు డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వీవవనెశీయిఎ.ఖజూ.ప్రశీజ.ఱఅ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ సూచించారు.



# ఆంధ్ర కేసరి టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

విజయనగరం, ఆగస్టు 23 నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రిగారి క్యాంప్ కార్యాలయం నందు టంగుటూరి జయంతి సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెల్ల దొరలను గడగడలాడించిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు గారి సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ తుపాకులకు ఎదురొడ్డి నిలిచిన ధీరుడు టంగుటూరి అని, బ్రిటీష్ పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక యువకుడు మరణించగా మృతదేహాన్ని చూడటానికి ప్రకాశం పంతులుగారు వెళ్ళగా, పోలీసులు ఆయనను అడ్డుకుంటూ, ముందుకు వస్తే కాల్చివేస్తామని తుపాకులు గురిపెట్టారనీ, దానికి ఏమాత్రం భయపడకుండా, ప్రకాశం గారు తన కోటు గుండీలు విప్పి కాల్చండి చూద్దాం అంటూ గుండెను చూపించిన ధైర్యశాలి అని, ఆయన ధైర్యానికి బ్రిటీష్ సైనికులు సైతం వెనక్కి తగ్గారన్నారు. టంగుటూరు చూపించిన సాహసానికే ఆంధ్ర కేసరి అనే బిరుదు దక్కిందన్నారు. టంగుటూరి పేరు మీదగా నేడు అమరావతికి, ఆంధ్ర రాష్ట్రానికి తలమానికమైన విజయవాడలో ఉన్న ప్రకాశం బ్యారేజీ తెలుగువారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందన్నారు. టంగుటూరి ధైర్యం తెలుగు వారందరికీ కూడా స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయ సాధనకు ప్రతి తెలుగు వారు కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# నిరాడంబరత, ధైర్యం, పట్టుదలకు ప్రతీక ప్రకాశం పతులు

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

నిరాడంబరత, నిజాయితీ, పట్టుదల, క్రమశిక్షణ, ధైర్యసాహసాలకు ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులుగారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన మహోన్నత వ్యక్తి ప్రకాశం పంతులు అని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ పాలకుల ఎదుట నిర్భయంగా నిలిచి, తన సాహసాన్ని చాటుకున్న ప్రకాశం పంతులు తెలుగువారి ధైర్యసాహసాలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే పెద్దపీట వేసిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనియమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.






# పోలీసు వాహన ప్రమాదం జరగటం దురదృష్టకరం

**ప్రమాదంలో రమణ మృతి చెందటం బాధాకరం**

**మెడికవర్ ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరామర్శ**

**పోలీసు కుటుంబాల వారికి ఓదార్పు**

**ముఖ్యమంత్రి గారికి హోం మంత్రి గారికి వివరణ**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు, ఎస్పీ దామోదర్ గారు**

విజయనగరం, ఆగస్టు 23, నగర పరిధిలో కేసు దర్యాప్తు నిమిత్తం వెళుతున్న పోలీసు వాహన ప్రమాదం జరగటం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గాజుల రేగ కొండ మీద పోలీసు వాహనం బోల్తా పడిన విషయం తెలిసిన వెంటనే ఎస్పీ దామోదర్ తో ప్రమాద సంఘటన వివరాలను ఫోన్లో అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న మెడికవర్ ఆసుపత్రి వద్దకు వెనువెంటనే మంత్రి చేరుకున్నారు. తీవ్ర గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఎస్ఐ అశోక్, కానిస్టే బుల్ రాజారావు లను పరామర్శించారు. అనంతరం ప్రమాద బాధిత కుటుంబ సభ్యులతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. అనుకోని ప్రమాదంలో గాయపడిన పోలీసు మిత్రులకు పోలీసు వ్యవస్థ, ప్రభు త్వం అండగా ఉంటుందని ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉ ండాలని కోరారు. బాధితుల కుటుంబ సభ్యులతో మం త్రి కొండపల్లి మమేకమై మాట్లాడారు. వైద్యం జరుగు తున్న తీరును ఎస్పీ దామోదర్ మరియు ఇతర పోలీసు అధికారులను మంత్రి కొండపల్లి అడిగి తెలుసుకున్నారు. ప్రమాద సంఘటన వివరాలను చంద్ర బాబునాయుడు గారికి, హోం మంత్రి వంగలపూడి అనిత గారికి వివరించినట్లు తెలిపారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బాధాతప్త హృదయంతో మాట్లాడగా, ఎస్పీ దామోదర్ కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్ఐ వి అశోక్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జీ నాగేంద్రప్రసాద్, కానిస్టేబుల్ కం డ్రైవర్ కే రాజబాబు, కానిస్టేబుల్ సిహెచ్ వెంకటరమణ కేసు దర్యాప్తు నిమిత్తం వెళుతుండగా వాహనానికి బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వైద్యులు శాయశక్తులా కృషి చేసినప్పటికీ ఈ ప్రమాదంలో విధి నిర్వహణలో చాకచక్యంగా పనిచేసే కానిస్టేబుల్ ఎస్ వెంకట రమణ మృతి చెందటం బాధాకరమైన విషయం అని మంత్రి కొండపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. రాజబాబుకు నడుము వద్ద ఆపరేషన్ అవసరం కావడంతో ఆపరేషన్ చేస్తున్నారని, డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదమే తప్పిందని మంత్రి కొండపల్లి వివరించారు. ఈ ప్రమా దంలో ఎస్సై అశోక్ కుమార్ కు ఎడమ కాలు విరిగిం దని, జి నాగేంద్ర ప్రసాద్ కు ఎడమ చేయి విరిగినట్లు వైద్యులు తెలిపారన్నారు. ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది ధైర్యంగా ఉండాలని మంత్రి కొండపల్లి కోరారు. మెడి కవర్ వైద్య బృందం పోలీస్ సిబ్బందికి మెరుగైన వైద్య చికిత్సను అందించాలని ఆదేశించారు.



# స్కూల్ అసిస్టెంట్ మర్రాపు సేవలు అమూల్యం

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

గజపతినగరం, ఆగస్టు 23: స్కూల్ అసిస్టెంట్ మర్రాపు తిరుపతిరావు సేవలు అమూల్యం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం దత్తిరాజేరు మండలం విజయరాంపురం గ్రామంలో ఎంపీపీ స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న మర్రాపు తిరుపతిరావు పదవి విరమణ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ విధులలో పదవీ విరమణ తప్పక పొందాలని, ఇకమీదట కుటుంబంతో శేష జీవితం హాయిగా గడపాలని కోరుకుంటూ, భావితరానికి బంగారు భవిష్యత్తును కలగజేసే విద్యార్థులకు ఖాళీ సమయంలో మర్రాపు సలహాలు సూచనలు అందజేయాలని సూచించారు.

# ఉద్యోగుల ఉత్సాహానికి క్రీడలే ఊతం

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్

యునైటెడ్ తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్-- ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల మెగా క్రికెట్ టోర్నమెంట్ (ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్) పోటీలు ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఇబ్రహీంపట్నం మండలం, మూలపాడులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఉత్సాహభరితంగా జరిగాయి. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విజేతలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు.

ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్‌లో ఇరిగేషన్--1, ఇరిగేషన్--2, ఎడ్యుకేషన్, రెవెన్యూ, సెక్రటేరియట్--1, పంచాయతీరాజ్, ఏపీ ఎన్జీవో--1,

ఏపీ ఎన్జీవో--2, మున్సిపల్, సెక్రటేరియట్--2 మొత్తం పది జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్లో ఏపీ ఎన్జీవో, స్కూల్ ఎడ్యుకేషన్ జట్లు తలపడగా ఏపీ ఎన్జీవో జట్టు టైటిల్ ను చేజిక్కించుకుంది. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ టీం నిర్ణీత 16 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 149 పరుగుల దగ్గర



ఆగిపోవడంతో సూపర్ ఓవర్ ఆడాల్సి వచ్చింది. సూపర్ ఓవర్లో ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ జట్టు ఘన విజయం సాధించింది.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ

క్రీడలు ఉద్యోగులలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నిరంతరం విధి నిర్వహణలో ఒత్తిడికి లోనయ్యే ఉ ద్యోగులకు క్రీడలు మంచి విరామాన్ని అందించడంతో పాటు ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంచుతాయని పేర్కొన్నారు. క్రికెట్ వంటి జట్టు క్రీడలు టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలు, సమన్వయం, పరస్పర సహకారం, నిర్ణయ సామర్థ్యం వంటి గుణాలను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యాలయాల్లో కూడా సమష్టిగా పనిచేసే వాతావరణాన్ని క్రీడలు బలోపేతం చేస్తాయని అన్నారు. ఉద్యోగులు విధులతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, పాల్గొన్న ఉద్యోగులను అభినందించారు.

లిలిక్రీడా స్ఫూర్తితో ఉద్యోగుల్లో ఐక్యత -- ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్లిలి

ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యత, ఆత్మీయతను పెంపొందించడంలో క్రీడలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగులు రోజువారీ విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి ఉత్సాహంగా పనిచేయడానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. విజయం సాధించాలనే పట్టుదలతో పాటు ఓటమిని స్వీకరించే మనస్తత్వం, క్రమశిక్షణ, సమయపాలన, సహచరులపై నమ్మకం వంటి విలువలను క్రీడలు నేర్పుతాయని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమానికి ఏపీ ఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, ఇలాంటి క్రీడా కార్యక్రమాలను మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న అన్ని జట్లను అభినందిస్తూ, విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.



# జిల్లాకు ఖ్యాతి తీసుకురావడం గర్వకారణం

## యువ క్రీడాకారుడు గురు నాయుడు కి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి సత్కారం

విజయనగరం, ఆగస్ట్ 23, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి జిల్లాకు ఖ్యాతి తీసుకురావడం గర్వకారణం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మంత్రిగారి క్యాంప్ కార్యాలయం నందు ఇటీవల కాలంలో ఉజ్బెకిస్తాన్ దేశంలో టాస్కాన్ సిటీలో జరిగిన ఏషియన్ జూనియర్ ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లాలోని నెల్లిమర్ల మండలం చంద్రంపేట గ్రామానికి చెందిన శనపతి గురునాయుడు (20) ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ 60 కేజీల విభాగంలో సత్తా చాటి చెప్పి సిల్వర్ మెడల్ సాధించటం మన ప్రాంతానికి ఆదర్శనీయమన్నారు. గురు నాయుడు అత్యంత చిన్న వయసులోనే దేశం తరఫున 43 దేశాలు పాల్గొన్న క్రీడా పోటీలలో పాల్గొని ద్వితీయ స్థానం సాధించడం తనలోని పట్టుదలను తెలియజేస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి, దేశానికి, ఆంధ్రప్రదేశ్ కు, విజయనగరం జిల్లాకు కీర్తి తెచ్చి పెట్టే విధంగా కృషి చేయాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సువ్వాడ రవి శేఖర్, అజయ్ బాబు, కంది సత్యనారాయణ, నాగేశ్వరరావు, సన్యాసి అప్పడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎమ్డీఏ వేలానికి వ్యతిరేకంగా ధర్నా




**హైదరాబాద్, ఆగస్టు 23**

హైదర్‌నగర్‌లోని మిత్రహిల్స్ కాలనీలో హెచ్ఎమ్డీఏకు చెందిన సుమారు 2000 గజాల స్థలాన్ని వేలం వేయాలనే ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆదివారం స్థానికులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ పాల్గొని కాలనీవాసులకు మద్దతు ప్రకటించారు. స్థానిక ప్రజలు, పిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆ స్థలాన్ని వేలం వేయకుండా పార్కుగా అభివృద్ధి చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కాలనీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పచ్చదనం, విశ్రాంతి, వినోదానికి అవసరమైన బహిరంగ ప్రదేశాలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ సంస్థలు తీసుకునే నిర్ణయాలు సరైనవి కావని అన్నారు. కాలనీవాసుల అభిప్రాయాలను తెలుసుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా స్థలాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, పిల్లలకు ఆటస్థలాలు, వృద్ధులకు నడక మార్గాలు, కుటుంబాలకు విశ్రాంతి ప్రదేశాలు అందించే పార్కులు నగర జీవనంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మిత్రహిల్స్ ప్రాంతంలో పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం, హెచ్ఎమ్డీఏ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో పాల్గొన్న కాలనీవాసులు, ఇప్పటికే పరిసర ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గిపోతున్నాయని, ఈ స్థలం కూడా వేలానికి వెళితే ప్రజలకు అందుబాటులో ఉన్న పచ్చని ప్రదేశాలు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అవసరాలను గుర్తించి వేలం ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్ నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నిరసనకారులు స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఆధ్యాత్మిక క్షేత్రాలకు రహదారుల కల్పన

**వందకు పైగా ఆలయాలకు అనుసంధాన రోడ్లు**

**రూ.120 కోట్లతో 205 కిలోమీటర్ల పనులు**

**భక్తుల సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం**

**పలు జిల్లాల్లో వేగంగా కొనసాగుతున్న నిర్మాణాలు**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పంతో...**



**అమరావతి, ఆగస్టు 23 :**

రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలకు భక్తులు సులభంగా చేరుకునేలా గ్రామీణ రహదారి మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వందకు పైగా ప్రధాన దేవాలయాలకు రహదారి సౌకర్యాలు కల్పించే కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. ఇందుకోసం రూ.120 కోట్ల వ్యయంతో 205 కిలోమీటర్ల మేర కొత్త రహదారులు, అనుసంధాన మార్గాల నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అనేక పుణ్యక్షేత్రాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనల సందర్భంగా గుర్తించారు. భక్తులు, స్థానిక ప్రజల నుంచి అందిన వినతుల ఆధారంగా ఆలయాలకు వెళ్లే మార్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వీబీజీఆర్‌జీ, సాస్కీ తదితర నిధులతో ఈ పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల్లో దాదాపు 40 శాతం రహదారుల నిర్మాణం పూర్త యింది. మరో 26 రహదారులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అంతర్వేది, అహోబిలం, గట్టు వెంకటరమణ స్వామి ఆలయం, పుడియగిరి లక్ష్మీనర సింహస్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు, సింగిరికోన, సోమేశ్వరం, తలుపులమ్మలోవ, ఐఎస్ జగన్నాథపురం వంటి ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలకు సంబంధించిన రహదారుల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల దృష్ట్యా పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.30 కోట్లు కేటాయించారు. అలాగే కోనసీమ తిరుమల వాడపల్లి కరకట్ట మార్గం, అర్థగిరి ఆంజనేయస్వామి ఆలయం రోడ్డు, నిడదవోలు ఆంజనేయ స్వామి రహదారి, తోటవారిపల్లి మల్లేశ్వరస్వామి ఆలయ మార్గం వంటి పలు ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. పుణ్యక్షేత్రాలకు వెళ్లే రహదారులు నాణ్యతతో, దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా నిర్మించాలని పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన మార్గాలను స్వయంగా పరిశీలించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఆలయాలను ఈ కార్యక్రమంలో చేర్చి రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతమివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. రహదారి అనుసంధానం పూర్తయిన తర్వాత ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఇది తోడ్పడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# రూ.3.40 కోట్లతో నూతన రహదారికి భూమిపూజ

**వితంరాజుపల్లి--చినకంచెర్ల రోడ్డు పనులకు శ్రీకారం**

**కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిపాటి రవికుమార్**

**గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం**

**రవాణా సౌకర్యాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబాటు**



**వినుకొండ, ఆగస్టు 23 :**

వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలంలో రూ.3.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వితంరాజుపల్లి--చినకంచెర్ల వయా పిచికలపాలెం నూతన తారురోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రహదారి నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని నాయకులు పేర్కొన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులకు పునర్వైభవం తీసుకొస్తున్నా మని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. మారుమూల గ్రామాలను ప్రధాన రహదా రులతో అనుసంధానం చేయడం ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు మరింత సౌలభ్యం కలుగుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం కీలకమని, ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు మాట్లాడుతూ, ప్రజల రవాణా కష్టాలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని, నాణ్యమైన రహదారులు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను ప్రజలకు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.



# తెల్ల రక్తకణాల ప్రాధాన్యం

**డెస్క్, ఆగస్టు 23**

తెల్ల రక్తకణాలు (వైట్ బ్లడ్ సెల్స్) మన శరీర రోగనిరోధక వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన భాగం. ఇవి శరీరంలోకి ప్రవేశించే బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్‌లు మరియు ఇతర హానికర సూక్ష్మజీవులతో పోరాడి మన ఆరోగ్యాన్ని కాపాడుతాయి. అందుకే వీటిని శరీర రక్షణ సైనికులుగా వైద్య నిపుణులు అభివర్ణిస్తారు. తెల్ల రక్తకణాలు ఎముక మజ్జలో తయారవుతాయి. శరీరంలో ఎక్కడైనా ఇన్‌ఫెక్షన్ లేదా వాపు ఏర్పడితే వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని హానికర సూక్ష్మజీవులను నాశనం చేయడానికి ప్రయత్నిస్తాయి. శరీర రోగనిరోధక శక్తి సక్రమంగా పనిచేయడానికి వీటి పాత్ర చాలా కీలకం. రక్త పరీక్షల్లో తెల్ల రక్తకణాల సంఖ్యను పరిశీలించడం ద్వారా ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ఒక అవగాహన పొందుతారు. ఇన్‌ఫెక్షన్లు, వాపు, కొన్ని రక్త సంబంధిత వ్యాధులు ఉన్నప్పుడు తెల్ల రక్తకణాల సంఖ్య పెరగవచ్చు. మరోవైపు కొన్ని వైరల్ వ్యాధులు, ఎముక మజ్జ సమస్యలు లేదా కొన్ని మందుల ప్రభావం వల్ల ఈ సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. తెల్ల రక్తకణాల సంఖ్య తక్కువగా ఉంటే శరీరం ఇన్‌ఫెక్షన్లకు సులభంగా గురయ్యే ప్రమాదం ఉంటుంది. తరచూ జ్వరం, గొంతు ఇన్‌ఫెక్షన్లు, బలహీనత వంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే రక్త పరీక్షలో సంఖ్యలో మార్పు కనిపించిందని మాత్రమే వ్యాధి ఉందని నిర్ణయించలేమని వైద్యులు చెబుతున్నారు. ఇతర పరీక్షలు, లక్షణాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, క్రమం తప్పని వ్యాయామం, పరిశుభ్రత చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.



# దానిమ్మతో ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు

**డెస్క్, ఆగస్టు 23**

దానిమ్మ పండు పోషక విలువలు సమృద్ధిగా కలిగిన పండ్లలో ఒకటి. ఇందులో విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. రోజూ పరిమిత మోతాదులో దానిమ్మ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా దోహదం చేస్తాయి. రక్తహీనత సమస్య ఉన్నవారికి కూడా దానిమ్మ ఉపయోగకరంగా భావిస్తారు. జీర్ణక్రియను మెరుగుపరచడంలో దానిమ్మ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులోని ఫైబర్ పేగుల ఆరోగ్యాన్ని కాపాడి మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. వేసవిలో దానిమ్మ రసం తీసుకోవడం వల్ల శరీరానికి తగినంత ద్రవాలు అందుతాయి. అయితే మధుమేహం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దానిమ్మను ఆహారంలో చేర్చే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. పరిమిత మోతాదులో తీసుకుంటే దానిమ్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

# విటమిన్-కె ఎందుకు అవసరం?

**డెస్క్ ఆగస్టు 23**

విటమిన్–కె శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో ఒకటి. గాయం అయినప్పుడు రక్తస్రావం ఎక్కువసేపు కొనసాగకుండా రక్తం గడ్డకట్టే ప్రక్రియలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా విటమిన్–కె ముఖ్యమైన పాత్ర వహిస్తుందని వైద్య నిపుణులు చెబుతు న్నారు.



విటమిన్–కె ప్రధానంగా ఆకుకూ రల్లో ఎక్కువగా లభిస్తుంది. పాలకూర, తోటకూర, బచ్చలికూర, మునగ ఆకులు, క్యాబేజీ, బ్రోకోలీ వంటి ఆకుపచ్చ కూరగాయల్లో ఇది సమృద్ధిగా ఉంటుంది. అలాగే కొన్ని విత్తనాలు, కాయధాన్యాలు, పులియబెట్టిన ఆహారాల్లో కూడా కొంతమేర లభిస్తుంది. శరీరంలో విటమిన్–కె తక్కువగా ఉంటే గాయమైనప్పుడు రక్తస్రావం ఎక్కువసేపు కొనసాగడం, చిన్న గాయాలకే త్వరగా నీలి మచ్చలు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. తీవ్రమైన లోపం ఉంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అయితే సాధారణంగా సమతుల్య ఆహారం తీసుకునే వారిలో ఈ లోపం అరుదుగానే కనిపిస్తుంది. విటమిన్–కె ఎముకల్లో కాల్షియం సరైన విధంగా నిల్వ కావడానికి సహాయపడుతుంది. దీంతో ఎముకల బలం మెరుగుపడటానికి తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో ఎముకల బలహీనతను తగ్గించడంలో కూడా ఇది కొంత ఉపయోగకరంగా ఉండవచ్చని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే రక్తం పలుచబడే మందులు వాడుతున్నవారు విటమిన్–కె అధికంగా ఉండే ఆహారాలను తీసుకునే విషయంలో వైద్యుల సూచనలు పాటించాలి.




# పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేస్తున్నారా? ట్యాక్స్ నిబంధనలు ఇవే

హైదరాబాద్, ఆగస్టు 23

ఉద్యోగుల ఆర్థిక అవసరాల్లో ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కీలకంగా ఉంటుంది. అవసరమైన సమయంలో ఉద్యోగంలో ఉన్నప్పుడే కొంత మొత్తాన్ని ముందస్తుగా విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే పీఎఫ్ డబ్బులను ఉపసంహరించుకునే ముందు పన్ను నిబంధనలను తెలుసుకోవడం చాలా ముఖ్యం. పీఎఫ్‌పై ట్యాక్స్ ఎప్పుడు పడుతుంది?

పీఎఫ్ మొత్తాన్ని పూర్తిగా పన్ను మినహాయింపు కలిగినదిగా భావించడం సరికాదు. ఉద్యోగి నిరంతర సర్వీస్ కాలం, విత్‌డ్రా చేసే సమయం వంటి అంశాల ఆధారంగా పన్ను వర్తించే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఐదేళ్ల నిరంతర సర్వీస్ పూర్తికాకముందే పీఎఫ్ మొత్తాన్ని విత్‌డ్రా చేస్తే, ఆ మొత్తంపై పన్ను నిబంధనలు వర్తించవచ్చు. ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి ఉద్యోగం మారినప్పుడు పీఎఫ్ ఖాతాను బదిలీ చేసుకుంటే, గత సర్వీస్ కాలం కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఐదేళ్లలోపు విత్‌డ్రా చేస్తే? ఐదేళ్ల నిరంతర సర్వీస్ పూర్తికాకముందే పీఎఫ్ విత్‌డ్రా చేస్తే, నిబంధనలకు అనుగుణంగా టీడీఎస్ (ఐణూ) వర్తించవచ్చు. సాధారణంగా పాన్ వివరాలు అందుబాటులో ఉన్నప్పుడు 10 శాతం టీడీఎస్ వర్తించే పరిస్థితి ఉంటుంది. పాన్ వివరాలు ఇవ్వకపోతే అధిక రేటుతో టీడీఎస్ కట్ అయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల పీఎఫ్ విత్‌డ్రాకు ముందు పాన్ వివరాలను యూఏఎన్ (ఖూాచీ) ఖాతాలో సరిగ్గా అప్‌డేట్ చేసుకోవడం మంచిది. ఐదేళ్ల సర్వీస్ పూర్తయితే?

ఐదేళ్ల నిరంతర సర్వీస్ పూర్తయిన తర్వాత పీఎఫ్ మొత్తాన్ని ఉపసంహరించుకుంటే సాధారణంగా పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుంది. ఉద్యోగం మారిన సందర్భంలో పీఎఫ్ బ్యాలెన్స్‌ను బదిలీ చేసుకుంటే సర్వీస్ కొనసాగింపుగా పరిగణించే అవకాశం ఉంటుంది. రూ.2.5 లక్షలకు మించి ఉద్యోగి వాటా ఉంటే? ఒక ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగి పీఎఫ్ ఖాతాలో జమ చేసే స్వంత వాటా రూ.2.5 లక్షలకు మించి ఉంటే, నిర్దేశిత పరిమితికి మించిన మొత్తంపై వచ్చే వడ్డీకి ప్రత్యేక పన్ను నిబంధనలు వర్తిస్తాయి. అధిక వేతనాలు పొందే ఉద్యగులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా గమనించాలి. విత్‌డ్రా ముందు నిబంధనలు తెలుసుకోండి

పీఎఫ్ మొత్తాన్ని అత్యవసర సమయంలో తీసుకునే ముందు మీ సర్వీస్ కాలం, పాన్ వివరాలు, టీడీఎస్ నిబంధనలు, విత్‌డ్రా కారణం వంటి అంశాలను పరిశీలించాలి. పన్ను విషయంలో సందేహం ఉంటే అధికారిక ఈపీఎఫ్ఓ సమాచారం లేదా పన్ను నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

# బంగారం ధరలు మళ్లీ పైపైకి..

**హైదరాబాద్, ఆగస్టు 23**



అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. దీంతో పసిడి ధరలు భారీ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,63,090గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,49,500గా ఉంది. హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,70,000గా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలతో పాటు దేశంలోని పలు నగరాల్లోనూ బంగారం ధరలు దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయి. ఏపీ నగరాల్లో ధరలు ఇలా.. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1, 63,090గా ఉంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,49,500గా, 18 క్యారెట్ల బంగారం రూ.1,22,320గా నమోదైంది. తెలంగాణలోనూ భారీ ధరలు.. హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,63,090గా ఉంది. 22 క్యారెట్ల ధర రూ.1,49,500 కాగా, 18 క్యారెట్ల ధర రూ.1,22, 320గా కొనసాగుతోంది. దేశ రాజధానిలో స్వల్పంగా అధికం.. దేశంలోని ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,63,240గా, 22 క్యారెట్ల ధర రూ.1,49,650గా ఉంది. ముంబై, కోల్‌కతా, కేరళలో 24 క్యారెట్ల ధర రూ.1,63,090గా నమోదైంది.

# స్మార్ట్ మీటర్‌లో రీడింగ్ తేడాలా? ఇలా గుర్తించండి

**హైదరాబాద్, ఆగస్టు 23**




దేశవ్యాప్తంగా ఇళ్లలో విద్యుత్ వినియోగాన్ని ఖచ్చితంగా లెక్కించేందుకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా విద్యుత్ వినియోగం, యూనిట్లు, బిల్లింగ్ వివరాలను తెలుసుకోవచ్చు. అయితే మీటర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు రీడింగ్‌లలో అసాధారణ మార్పులు కనిపించే అవకాశం ఉంది. అలాంటి సమయంలో వినియోగదారులు కొన్ని అంశాలను పరిశీలించాలి. డిస్‌ప్లేలో మార్పులు కనిపిస్తున్నాయా? ముందుగా స్మార్ట్ మీటర్ డిస్‌ప్లేను పరిశీలించాలి. సాధారణంగా ఇందులో విద్యుత్ వినియో గం, యూనిట్లు, తక్షణ విద్యుత్ వినియోగం వంటి వివరాలు కనిపిస్తాయి. తెర పూర్తిగా ఆఫ్‌గా ఉండటం, పదేపదే మినుకుమినుకుమనడం, రీడింగ్‌లు సరిగ్గా కనిపించకపోవడం సమస్యకు సంకేతం కావచ్చు. అయితే కేవలం డిస్‌ప్లే ఆధారంగా మీటర్ పాడైందని నిర్ధారించ కూడదు. విద్యుత్ సరఫరా లేదా సమాచార ప్రసార సమస్యల వల్ల కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడవచ్చు. ఒక్కసారిగా యూనిట్లు పెరిగితే? విద్యుత్ వినియోగం అకస్మాత్తుగా పెరిగినప్పుడు వెంటనే మీటర్ తప్పుగా పనిచేస్తోందని భావించకూడదు. ముందుగా ఇంట్లో అధిక విద్యుత్ వినియోగించే ఏసీ, గీజర్, హీటర్, నీటి మోటారు, ఫ్రిజ్ వంటి పరికరాలను పరిశీలించాలి. అవసరం లేని పరికరాలను ఆపివేసిన తర్వాత కూడా మీటర్ రీడింగ్ అసాధారణంగా పెరుగుతుంటే విద్యుత్ శాఖను సంప్రదించడం మంచిది. ఇలా ప్రాథమికంగా పరిశీలించొచ్చు ఇంట్లోని చాలా విద్యుత్ పరికరాలను ఆపివేసి మీటర్ రీడింగ్‌ను గమనించాలి. అనంతరం విద్యుత్ సామర్థ్యం తెలిసిన ఒక బల్బు లేదా ఒక ఫ్యాన్‌ను మాత్రమే కొంతసేపు ఆన్ చేసి చూడాలి. పరికరం పనిచేస్తున్న సమయంలో మీటర్‌లో విద్యుత్ వినియోగ రీడింగ్‌లో మార్పు కనిపించాలి. ఇది కేవలం ప్రాథమిక పరిశీలన మాత్రమే. మీటర్‌ను తెరవడం, వైరింగ్‌ను మార్చడం లేదా స్వయంగా మరమ్మతులు చేయడం ప్రమాద కరం. యాప్‌లో సమాచారం నవీక రిం చకపోతే? స్మార్ట్ మీటర్‌కు అనుసంధానమైన యాప్ లేదా ఆన్‌లైన్ పోర్టల్ ఉంటే అందులో నమో దైన విద్యుత్ వినియోగ వివరాలను కూడా పరిశీలించాలి.

# రాఖీ వేళ అమెజాన్ భారీ ఆఫర్లు

**హైదరాబాద్, ఆగస్టు 23**

రాఖీ పౌర్ణిమ పండుగను పురస్కరించుకుని ప్రముఖ ఈ–కామర్స్ వేదిక అమెజాన్ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఫ్యాషన్, అందాల ఉత్పత్తులు, గృహోపకరణాలు, వంటగది సామగ్రి, ఎలక్ట్రానిక్స్ తదితర విభాగాల్లోని ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై 70 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపింది. ప్రముఖ బ్రాండ్లపై భారీ తగ్గింపులు రాఖీ ప్రత్యేక విక్రయాల్లో భాగంగా బిబా, లిబాస్, మాన్యవర్ వంటి ఫ్యాషన్ బ్రాండ్లతో పాటు శామ్‌సంగ్, ఎల్జీ, సోనీ వంటి ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ల ఉత్పత్తులపైనా ప్రత్యేక ధరలు అందుబాటులో ఉన్నట్లు అమెజాన్ వెల్లడించింది. పండుగ సందర్భంగా కొనుగోళ్లు చేసే వారికి ఈ ఆఫర్లు ప్రయోజనకరంగా ఉండనున్నాయి. ప్రైమ్ సభ్యులకు అదనపు ప్రయోజనం అమెజాన్ ప్రైమ్ సభ్యులకు సాధారణ తగ్గింపులతో పాటు అదనంగా 5 శాతం




తగ్గింపు లభించ నుంది. పండుగ బ హుమతులు సకాలం లో చేరేలా వేగవం తమైన సరఫరా సదు పాయాన్ని కూడా అం దిస్తున్నట్లు సంస్థ తెలి పింది. రూ. 19 నుంచే రాఖీలు రాఖీ పండుగ కోసం రూ. 19 నుం చే 500 కు పైగా రకా ల రాఖీ లు అందు బా టులో ఉంచినట్లు అమె జాన్ పేర్కొంది. వీటిని వేగవంతమైన సరఫరా సేవ ద్వారా అంది స్తున్నారు.

# ఐపీఓకు జెమినీ ఎడిబుల్స్.. సెబీకి డీఆర్‌హెచ్‌పీ దాఖలు

**న్యూఢిల్లీ, ఆఆగస్టు 23**

‘ఫ్రీడమ్’, ‘బీ–రైట్’, ‘ఫస్ట్ క్లాస్’ వంటి బ్రాండ్ పేర్లతో వంటనూనె ఉత్పత్తులను విక్రయిస్తున్న హైదరాబాద్‌కు చెందిన జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా (జీఈఎఫ్) పబ్లిక్ ఇష్యూకు సిద్ధమైంది. తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఐపీఓ జీఈఎఫ్ ప్రతిపాదిత ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉండనుంది. ఇందులో భాగంగా కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు తమ వాటాలను విక్రయించనున్నారు. 4.11 కోట్ల షేర్ల విక్రయం ఐపీఓలో ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు గరిష్ఠంగా 4.11 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఓఎఫ్ఎస్ కావడంతో ఈ షేర్ల విక్రయం ద్వారా వచ్చే నిధులు నేరుగా కంపెనీకి కాకుండా వాటాలను విక్రయిస్తున్న ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు వెళ్లనున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా వంటనూనెల విభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ‘ఫ్రీడమ్’ తదితర బ్రాండ్లతో మార్కెట్లో గుర్తింపు పొందిన ఈ హైదరాబాద్ సంస్థ ఐపీఓ ద్వారా క్యాపిటల్ మార్కెట్లలోకి ప్రవేశించేందుకు అడుగులు వేస్తోంది.





# పాత హెల్మెట్‌తో ప్రాణాలకు ముప్పు

**హైదరాబాద్, ఆగస్టు 23**

ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. హెల్మెట్‌ను ఒక్కసారి కొనుగోలు చేసి సంవత్సరాల తరబడి ఉపయోగించడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బయటకు ఎలాంటి నష్టం కనిపించకపోయినా, కాలక్రమేణా హెల్మెట్‌లోని లోపలి ప్యాడింగ్, లైనింగ్, ఇతర భద్రతా భాగాలు బలహీనపడే అవకాశం ఉంది. దీంతో ప్రమాద సమయంలో తలకు అందాల్సిన రక్షణ తగ్గిపోవచ్చు.

### ఐదేళ్లు దాటితే మార్చేయాలి

సాధారణంగా హెల్మెట్‌ను మూడు నుంచి ఐదేళ్ల తర్వాత మార్చుకోవాలని సూచిస్తున్నారు. రోజువారీగా హెల్మెట్‌ను ఉపయోగించే వారు అంతకంటే ముందే మార్చాల్సిన అవసరం ఉండొచ్చు. నిరంతర వినియోగంతో లోపలి ప్యాడింగ్ కుచించుకుపోయి హెల్మెట్ వదులుగా మారుతుంది. అందువల్ల హెల్మెట్‌పై ఉన్న తయారీ తేదీ, తయారీదారు సూచనలను తప్పనిసరిగా పరిశీలించాలి.

### ప్రమాదం జరిగితే వెంటనే కొత్తది

హెల్మెట్ ధరించి ప్రమాదానికి గురైనప్పుడు బయటకు ఎలాంటి పగుళ్లు లేదా గీతలు కనిపించకపోయినా దాన్ని తిరిగి ఉపయోగించకపోవడమే మంచిది. ప్రమాదం ప్రభావంతో లోపలి భద్రతా నిర్మాణానికి కంటికి కనిపించని నష్టం జరిగి ఉండవచ్చు. నేలపై బలంగా పడిన హెల్మెట్‌ను కూడా మార్చడం సురక్షితమైన నిర్ణయం. హెల్మెట్ తలకు మునుపటిలా బిగుతుగా సరిపోకపోయినా, తలపై అటూ ఇటూ కదులుతున్నా వెంటనే మార్చుకోవాలి. అరిగిపోయిన ప్యాడింగ్, చిన్ పట్టీ వంటి వాటిని కూడా గమనించాలి. ఎంత ఖరీదైన హెల్మెట్ అయినా తలకు సరిగ్గా సరిపోకపోతే ప్రమాద సమయంలో పూర్తి రక్షణ అందించలేకపోవచ్చు.

కొత్త హెల్మెట్ కొనుగోలు చేసేటప్పుడు సరైన పరిమాణం, సౌకర్యం, భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వైజర్‌పై ఎక్కువగా గీతలు పడినా దాన్ని మార్చడం మంచిది. పాతది, ప్రమాదానికి గురైనది లేదా వదులుగా మారిన హెల్మెట్‌ను కొనసాగించడం కంటే కొత్త హెల్మెట్ ఉపయోగించడం ద్వారా ప్రాణ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు.

# కొలంబోలో భారత్ జోరు..

## పడిక్కల్, గిల్ అర్ధశతకాలు

**కొలంబో, ఆగస్టు 23**

శ్రీలంకతో ఆదివారం కొలంబో వేదికగా ప్రారంభమైన రెండో టెస్టులో భారత్ పటిష్టంగా ఆడుతోంది. దేవదత్ పడిక్కల్ 61, శుభ్‌మన్ గిల్ 50 పరుగులతో అజేయ అర్ధశతకాలు సాధించారు. భారత్ 50.3 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. అంతకుముందు దూకుడుగా ఆడిన యశస్వి జైస్వాల్ 45 పరుగులు చేసి అశితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కేఎల్ రాహుల్ 18 పరుగులు చేసి వెనుదిరిగాడు. కాగా, సారాంశ్ జైన్ భారత జట్టు తరఫున టెస్టు అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లోనూ భారత్ విజయం సాధించి రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంటే, ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ 57.58 శాతంతో నాలుగో స్థానానికి చేరుకునే అవకాశం ఉంది.




# రిషభ్ పంత్‌కు గాయం.. భారత్‌కు ఎదురుదెబ్బ

**కొలంబో, ఆగస్టు 23**

: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ రిషభ్ పంత్ గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో మ్యాచ్ జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. 58వ ఓవర్‌లో గాయం ఇన్నింగ్స్ 58వ ఓవర్ తొలి బంతిని శ్రీలంక పేసర్ లాహిరు కుమార షార్ట్ లెంగ్త్‌లో సంధించాడు. ఆ బంతిని ర్యాంప్ షాట్ ఆడేందుకు పంత్ ప్రయత్నించగా.. అనూహ్యంగా పైకి ఎగిరిన బంతి అతని ఎడమ చేతి గ్లౌవ్ భాగాన్ని బలంగా తాకింది. దీంతో తీవ్ర నొప్పితో పంత్ వెంటనే గ్లౌవ్స్ తొలగించాడు. ఫిజియో చికిత్స అనంతరం.. ఘటన జరిగిన వెంటనే భారత జట్టు ఫిజియో మైదానంలోకి వచ్చి పంత్ చేతిని పరిశీలించాడు. మణికట్టుకు ఐస్ ప్యాక్ ఉంచడంతో పాటు బ్యాండేజ్ వేశారు. నొప్పి ఎక్కువగా ఉండటంతో బ్యాట్ పట్టుకోవడం కూడా



కష్టంగా మారింది. దీంతో అంపైర్లతో మాట్లాడిన అనంతరం పంత్ రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్‌కు వెళ్లాడు. గాయం తీవ్రతపై ఉత్కంఠ భారత జట్టులో కీలక బ్యాటర్‌తో పాటు వికెట్ కీపర్‌గా ఉన్న పంత్ రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగుతాడా లేదా అన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. గాయం తీవ్రతపై వైద్యుల పరీక్ష అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పంత్ అందుబాటులో లేకపోతే తదుపరి మ్యాచ్‌ల్లో భారత జట్టు సమతూకంపై ప్రభావం పడే అవకాశం ఉంది.

# పడిక్కల్ మరో శతకం.. భారత్ పటిష్ఠం

**కొలంబో, ఆగస్టు 23**

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ మరోసారి శతకంతో మెరిశాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగుల భారీ శతకం సాధించిన పడిక్కల్.. కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులోనూ సెంచరీతో అదరగొట్టాడు. అతని అద్భుత ఇన్నింగ్స్‌తో తొలి రోజు ఆటలో భారత్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ 45, కేఎల్ రాహుల్ 18 పరుగులు చేశారు. 66 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను పడిక్కల్ ఆదుకున్నాడు. గిల్‌తో కీలక భాగస్వామ్యం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి పడిక్కల్ మూడో వికెట్‌కు 120 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలో గిల్ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. అనంతరం గిల్ ఔటైన తర్వాత రిషభ్ పంత్ మూడు పరుగుల వద్ద గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. జడేజాతో కలిసి జోరు ఆ తర్వాత రవీంద్ర జడేజాతో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ప్రస్తుతం పడిక్కల్ 185 బంతుల్లో 12 ఫోర్లతో 111 పరుగులతో అజేయంగా ఉండగా.. జడేజా 45 బంతుల్లో 31 పరుగులు చేశాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 64 పరుగులు జోడించారు.



# కర్ణ్ శర్మ క్రికెట్‌కు వీడ్కోలు

**న్యూఢిల్లీ ఆగస్టు 23**

టీమిండియా లెగ్‌స్పిన్నర్ కర్ణ్ శర్మ అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 38 ఏళ్ల కర్ణ్ శర్మ యూపీ టీ20 లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్, మీరట్ మావెరిక్స్ మ్యాచ్ అనంతరం తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ఆగస్టు 25న లఖ్‌నవూ లెగ్ జట్టు ఆడే చివరి మ్యాచ్‌తో ఆటగాడిగా తన కెరీర్‌ను పూర్తిగా ముగించనున్నాడు. దాదాపు రెండు దశాబ్దాల కెరీర్ 2007-08 దేశవాళీ సీజన్‌లో ఫస్ట్‌క్లాస్, లిస్ట్-ఎ, టీ20 క్రికెట్‌లో అరంగేట్రం చేసిన కర్ణ్.. తొలినాళ్లలో ఆల్‌రౌండర్‌గా రాణించాడు. రంజీ ట్రోఫీ అరంగేట్రంలోనే సెంచరీ సాధించాడు. 2012-13 సీజన్‌లో మూడు రంజీ మ్యాచ్‌ల్లో 21 వికెట్లు పడగొట్టి బీసీసీఐ ఉత్తమ అండర్-25 క్రికెటర్ అవార్డును అందుకున్నాడు. ఐపీఎల్‌లోనూ ప్రత్యేక గుర్తింపు 2014 ఐపీఎల్ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కర్ణ్ శర్మను రూ.3.75 కోట్లకు కొనుగోలు చేసింది. అప్పట్లో అత్యధిక ధర పలికిన అన్‌క్యాప్డ్ భారత ఆటగాడిగా నిలిచాడు. అనంతరం పలు ఐపీఎల్ జట్లకు ప్రాతినిధ్యం



వహించాడు. అతడి చివరి ఐపీఎల్ మ్యాచ్ 2025లో ముంబై ఇండియన్స్ తరఫున జరిగింది. టీమిండియా తరఫున 3 ఫార్మాట్లలో 2014లో ఇంగ్లండ్ పర్యటనలో టీ20 అంతర్జాతీయ అరంగేట్రం చేసిన కర్ణ్.. తన తొలి మ్యాచ్‌లో జో రూట్‌ను ఔట్ చేశాడు. అదే ఏడాది శ్రీలంకపై వన్డే అరంగేట్రం చేశాడు. అనంతరం ఆస్ట్రేలియాతో అడిలైడ్‌లో టెస్టు అరంగేట్రం చేసి రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి నాలుగు వికెట్లు పడగొట్టాడు. అదే అతడి ఏకైక టెస్టుగా మిగిలిపోయిం ది.రిటైర్మెంట్‌పై కర్ణ్ శర్మ మాట్లాడుతూ.. తన ప్రయాణంలో అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, బీసీసీఐ, రైల్వేస్, యూపీసీఏ, ఆంధ్ర, విదర్భ క్రికెట్ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపాడు. ఇకపై క్రికెట్‌కు సంబంధించిన కోచింగ్, ఇతర బాధ్యతలకు అందుబాటులో ఉంటానని వెల్లడించాడు.

# బంగ్లాదేశ్ చరిత్ర.. టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి



**ఢాకా, ఆగస్టు 23**

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు టెస్టు ఫార్మాట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆదివారం విడుదల చేసిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకు సాధించింది. టెస్టు క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ తొలిసారి తొమ్మిదో స్థానాన్ని దాటి పైకి రావడం విశేషం. ఇటీవల ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 1-1తో సమం చేసింది. తొలి టెస్టులో చారిత్రక విజయం సాధించిన బంగ్లా జట్టు రెండో టెస్టులో ఓటమిపాలైంది. అయినప్పటికీ ఈ ప్రదర్శనతో 78 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి చేరుకుంది. ఈ క్రమంలో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంక జట్లను వెనక్కి నెట్టింది. కెప్టెన్ శాంటో హర్షం ఈ ఘనతపై బంగ్లాదేశ్ టెస్టు కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో ఆనందం వ్యక్తం చేశాడు. టెస్టుల్లో ఆరో ర్యాంకుకు చేరుకోవడం తమకు గొప్ప విజయమని పేర్కొన్నాడు. అయితే రెండో టెస్టులో మరింత మెరుగ్గా ఆడి ఉంటే సిరీస్‌ను గెలిచే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డాడు. తరచుగా ఆస్ట్రేలియా పర్యటనలు జరగాలి ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తమ జట్టు తరచుగా పర్యటించేలా అవకాశాలు కల్పించాలని శాంటో కోరాడు. సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ ఆడామని, అక్కడి పరిస్థితుల్లో ఆడటం ద్వారా ఆటగాళ్లకు ఎంతో అనుభవం వస్తుందని చెప్పాడు. టెస్టులతో పాటు వన్డేలు, టీ20ల కోసం కూడా ఆస్ట్రేలియా పర్యటనలు పెరగాలని విజ్ఞప్తి చేశాడు. తొలి టెస్టులో చారిత్రక విజయం డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ ఆస్ట్రేలియాను ఓడించింది. ఆసీస్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కట్టడి చేయడంలో హసన్ మహమూద్ ఆరు వికెట్లతో కీలక పాత్ర పోషించాడు. అనంతరం తంజీద్ హసన్ సెంచరీతో రాణించడంతో బంగ్లాదేశ్ 426 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 57 పరుగుల లక్ష్యాన్ని ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది.



## తాప్సీ--కంగనా వివాదంపై మరోసారి స్పందించిన తాప్సీ

హైదరాబాద్, ఆగస్టు 23

బాలీవుడ్ నటీమణులు తాప్సీ పన్ను, కంగనా రనౌత్ మధ్య గతంలో సోషల్ మీడియాలో జరిగిన వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తాప్సీ ఈ అంశంపై స్పందించింది. కంగనాతో ఇప్పటివరకు తాను నేరుగా కలవలేదని ఆమె తెలిపింది. అయితే గతంలో సోషల్ మీడియా వేదికగా జరిగిన వివాదాలపై తన అభిప్రాయాలను వెల్లడించింది. ఒక వ్యక్తి ఇతరుల గురించి ఎలా మాట్లాడుతున్నారనే దానిని బట్టి వారి పెంపకం, కుటుంబ నేపథ్యం, ప్రపంచాన్ని చూసే విధానం అర్థం చేసుకోవచ్చని తాప్సీ పేర్కొంది. తన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని చేసినవి కావని స్పష్టం చేసింది. గతంలో కంగనా సోదరి రంగోలి చందేల్ తాప్సీని విమర్శించడంతో వివాదం మొదలైంది. అనంతరం కంగనా కూడా తాప్సీపై వ్యాఖ్యలు చేయడంతో ఈ వ్యవహారం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. అయితే తాను ఎప్పుడూ కంగనాకు వ్యతిరేకంగా మాట్లాడలేదని తాప్సీ చెప్పింది. కంగనా మంచి నటి అని అంగీకరించేందుకు తనకు ఎలాంటి అహం లేదని, నటిగా ఆమె ప్రతిభను గౌరవిస్తానని తెలిపింది. ఇదే సమయంలో తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకూ తాప్సీ స్పందించింది. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన తనకు లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం మంచి కథలు, విభిన్నమైన సినిమాలు చేయడంపైనే తన దృష్టి ఉందని పేర్కొంది.

## మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్.. 'కాకా'పై క్లారిటీ, 'విశ్వంభర'పై నిరాశ

హైదరాబాద్, ఆగస్టు 23

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మెగా అభిమానులకు ఒకవైపు భారీ ట్రీట్ లభించగా.. మరోవైపు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశ్వంభర' విడుదల తేదీపై క్లారిటీ రాక నిరాశ ఎదురైంది. చిరంజీవి నటిస్తున్న రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్డేట్స్ వస్తాయని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. అందుకు తగ్గట్టుగానే దర్శకుడు బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న కొత్త సినిమాకు 'కాకా' అనే టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. టైటిల్‌తో పాటు విడుదల చేసిన గ్లింప్స్‌లో చిరంజీవిని సరికొత్త అవతార్‌లో చూపించడంతో అభిమానుల్లో జోష్ నెలకొంది. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ అంచనాలను మరింత పెంచింది. చిరంజీవి పాత్ర, లుక్, యాక్షన్ సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి.




## జాంబీ రెడ్డి 2 .. నెక్స్ట్ లెవెల్‌లో జాంబీ హంగామా!

హైదరాబాద్, ఆగస్టు 23

యువ హీరో తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా 'జాంబీ రెడ్డి 2: నెక్స్ట్ లెవెల్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. మొదటి భాగంతో తెలుగు తెరకు జాంబీ జోనర్‌ను పరిచయం చేసిన దర్శకుడు ప్రశాంత్ వర్మ.. ఈసారి సీక్వెల్‌ను మరింత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా మల్టీలింగ్వల్ ప్రాజెక్ట్‌గా ఈ చిత్రాన్ని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తు న్నారు. మొదటి భాగానికి దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ ఈసారి కథను అందిస్తుండగా.. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'రాణా నాయుడు' వంటి వెబ్ సిరీస్‌లతో గుర్తింపు పొందిన సుపర్ణ్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. తేజ సజ్జాతో పాటు కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. బాలీవుడ్ నటి షనయా కపూర్ ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. "బిగ్గర్, బ్యాడర్ & బ్లడీర్"గా సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. గౌర హరి సంగీతం అందిస్తుండగా.. హుస్సేన్ దలాల్, ప్రశాంత్ వర్మ, సుపర్ణ్ వర్మ కలిసి స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. "డెడ్ ఆర్ అలైవ్" అనే ట్యాగ్ లైన్‌తో విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.






## తాప్సీపై కంగనా ఫైర్.. మళ్లీ ముదిరిన వివాదం!

హైదరాబాద్, ఆగస్టు 23

బాలీవుడ్ నటీమణులు తాప్సీ పన్ను, కంగనా రనౌత్ మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. ఇటీవల తాప్సీ చేసిన వ్యాఖ్యలపై కంగనా తీవ్రంగా స్పందించారు. తాప్సీ వ్యాఖ్యలు తన పెంపకం, తల్లిదండ్రులను కించపరిచేలా ఉన్నాయని ఆమె మండిపడ్డారు. పెంపకంపై వ్యాఖ్యలకు కంగనా ఘాటు కౌంటర్ తాప్సీ ఓ ఇంటర్వ్యూలో కంగనాతో తనకు వ్యక్తిగత పరిచయం లేదని, వ్యక్తుల మాటలు వారి పెంపకం, ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తాయని వ్యాఖ్యానించారు. దీనిపై కంగనా సామాజిక మాధ్యమ వేదికగా తీవ్రంగా స్పందించారు. తన తల్లిదండ్రుల పెంపకాన్ని ప్రస్తావిస్తూ తాప్సీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి కొనసాగుతున్న వివాదం కంగనా సోదరి రంగోలి చందేల్ 2019లో తాప్సీని 'సస్తీ కాపీ' అంటూ విమర్శించడంతో ఈ వివాదం మొదలైంది. అనంతరం 2020లో బంధుప్రీతి అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో కంగనా.. తాప్సీని 'బి-గ్రేడ్ నటి' అంటూ విమర్శించారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. సినిమాలపైనే దృష్టి: తాప్సీ తాను రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని తాప్సీ స్పష్టం చేశారు. తన స్వభావం రాజకీయాలకు సరిపోదని, ప్రస్తుతం సినిమాలపైనే పూర్తిగా దృష్టి పెట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. తాప్సీ నటించిన 'గాంధారి' చిత్రం సెప్టెంబర్ 3న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. మరోవైపు కంగనా త్వరలో ఆర్. మాధవన్‌తో కలిసి ఓ మానసిక థ్రిల్లర్ చిత్రంలో నటించనున్నారు.



## ఓటీటీలో 'చెన్నై లవ్ స్టోరీ'.. ఫస్ట్ హాఫ్‌కు ఫిదా!

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన రొమాంటిక్ డ్రామా 'చెన్నై లవ్ స్టోరీ' ప్రస్తుతం ఓటీటీలో సందడి చేస్తోంది. థియేటర్లలో సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా మూవీని వీక్షిస్తున్నారు. దీంతో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. శ్రీ గౌరీ ప్రియ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో కిరణ్ అబ్బవ రం, ఆమె మధ్య కెమిస్ట్రీకి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. ప్రేమకథలోని భావోద్వేగ సన్నివేశాలను ఇద్దరూ బాగా పండించారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్ ఆసక్తికరంగా సాగిందని, హీరో--హీరోయిన్ మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని కామెంట్లు వినిపిస్తున్నాయి. మణిశర్మ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరో ప్లస్ పాయింట్‌గా నిలిచాయని ప్రేక్షకులు చెబుతున్నారు. అయితే ఇంటర్వెల్ తర్వాత కథనం విషయంలో మాత్రం మిశ్రమ స్పం దన వ్యక్తమవుతోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467